

## ఎన్నారై ముంద్రాతి రాముకు సన్మానం

ప్రవాస భారతీయుడు, హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ముంద్రాతి రాముని శనివారం వరంగల్ వాయిస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, పెంచాల గోపాల్, ఎ.రాజేంద్రప్రసాద్, చుంచు నాగరాజు, ముంద్రాతి సురేష్ కుమార్, పూజారి విజయ్ కుమార్, కార్తికేయ తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. – వరంగల్ వాయిస్, హనుమకొండ


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 011
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
డిసెంబర్ 13, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## రెండో విడత పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హసన్‌పర్తిలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

2లో..



## ఎన్నికలకు భారీ బందోబస్త్

వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



8లో..

## పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



## వసూళ్లు మానుకోండి

- ట్రాన్స్‌జెండర్ల పై సీపీ సజ్జనార్ ఆగ్రహం



# రేపే రెండో విడత పోలింగ్



వివరాలు2లో..

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండో విడత మొత్తం 4332 గ్రామ పంచాయతీలు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. పోలింగ్ జరుగనున్న మిగిలిన 3,911 సర్పంచ్ స్థానాలకు 28,278 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో పోటీ తీవ్రత తొలి విడతకంటే కాస్త ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ తోపాటు బీఆర్ఎస్ పోటీ చేస్తుండగా తమకు ఆదిపత్యం ఉన్న గ్రామాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు తలపడుతున్నారు. అయితే తొలివిడతలో 65 శాతం గ్రామ పంచాయతీల్లో విజయం సాధించి ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ రెండో విడతలోనూ తమ హవా కొనసాగించేందుకు సిద్ధపడుతుండగా బీఆర్ఎస్ రెండో విడతలోనైనా తన ఆదిపత్యాన్ని చాటుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు తరలిన సిబ్బంది
- 3,911 సర్పంచ్ స్థానాలకు పోటాపోటీ
- ఏకగ్రీవంగా 415 సర్పంచ్ ల ఎన్నిక
- తొలివిడత విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్

# రేపే రెండో విడత పోలింగ్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు తరలిన సిబ్బంది
- 3,911 సర్పంచ్ స్థానాలకు పోటాపోటీ
- ఏకగ్రీవంగా 415 సర్పంచ్ ల ఎన్నిక
- తొలివిడత విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రచార పర్వం శుక్రవారం ముగియడంతో అన్ని పార్టీల నాయకులు పంపకాలకు తెర లేపారు. ఆదివారం 3,911 సర్పంచ్ స్థానాలకు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఈ దశలో మొత్తం 4,332 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా ఇప్పటికే 415 సర్పంచ్ స్థానాలు, 8,304 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ హోరాహోరీ పోటీ పడుతున్నాయి. పోలింగ్, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి నిరాకరించారు.

**7 గంటలకే పోలింగ్ ప్రారంభం..**

ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు లంచ్ బ్రేక్. ఈ సమయంలోనే కౌంటింగ్ కు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తారు. మధ్యాహ్నం 2గంటలకు కౌంటింగ్ ప్రారంభించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సర్పంచ్, వార్డు సభ్యుల్లో విజేతలను ప్రకటించిన వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ తతంగం అంతా ముగిసే సరికి రాత్రి సమయం అయ్యే అవకాశం ఉంది.



**పార్టీలకు అతీతంగా..**

రాజకీయ పార్టీల గుర్తులతో కాకుండా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎవరికి వారు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కృషి చేస్తున్నారు. అయితే తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తొలి విడతలో మొత్తం 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరిగింది. కౌంటింగ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్ స్థానాలు 2,872 కాగా బీఆర్ఎస్ మద్దతుదారులు 1,160 కే పరిమితం అయ్యారు. బీజేపీ మద్దతుదారులు 195, స్వతంత్రులు 460 గెలుపొందారు.

**ప్రతిపక్షానికి షాక్..**

పల్లె పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని ప్రకటించినా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతుదారులు కేవలం 1,160 స్థానాలకే పరిమితం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీజేపీ మద్దతుదారులు దారుణంగా 195 స్థానాలకే పరిమితమయ్యారు. అయితే తొలి విడత విజయంతో రెట్టించిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఆ ఫలితాల జోరును రెండో విడతలోనూ కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ తమ బలగాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. రెండో విడత పోలింగ్ ద్వారా పల్లె ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో చూడాలి.

## రెండో విడత ఎన్నికలకు భారీ బందోబస్తు

**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**



**వరంగల్ వాయిస్, క్రైం :** పంచాయితీ రెండో విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. రేపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ మండలాల్లో జరిగే రెండో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1894 మంది పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఇందులో ముగ్గురు డీసీపీలతో పాటు ఐదుగురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, 18మంది ఇన్స్పెక్టర్లు, 32మంది ఎస్ఐలు, 120 మంది ఏఎస్ఐ, కానిస్టేబుళ్ళు 333, కానిస్టేబుళ్లు 1133, హోంగార్డ్స్ 258 మంది వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని. ఎన్నిక వేళ అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇంచార్జ్‌గా ఉంటారని, రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్ఐ/ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని, ఓట్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఎన్నిక వేళ ఎవరైనా ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడుతున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

**పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు ..**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 14న వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలో జరిగే రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ ఎస్సీఆర్ పీసీ 163 ప్రకారం(144 సెక్షన్) ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులు గా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం 13 తేదీ ఉదయం 6 గంటల నుంచి 14వ తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.

## బ్యాలెట్ పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన సీపీ



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాలను సందర్శించారు. గీసుగొండ, సంగెం, ఐనవోలు మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి కేంద్రాల పనితీరు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## రెండో విడత పోలింగ్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

- కలెక్టర్ స్నేహ శబరీష్
- హసన్‌పర్తిలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. హసన్‌పర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య, కేటాయించిన పీఓలు, ఓపీఓల హాజరుపై ఆరా తీశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ నిర్వహణ, రూట్ల వారీగా వాహనాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్ల వివరాలను ఎంపీడీఓ సుమనా వాణి, మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ పేపర్ల తనిఖీ పూర్తయిందో లేదో నిర్ధారించుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజర్వ్‌లో ఉన్న పోలింగ్ సిబ్బందితో కూడా కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆదివారం హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి, ధర్మసాగర్, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో పోలింగ్ జరగనుందని తెలిపారు. ఈ ఐదు మండలాల్లో మొత్తం 73 గ్రామ పంచాయతీలు, 694 వార్డులు ఉన్నాయి. ఐదు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు, ఉప సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, ఒక గ్రామంలో సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైందని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే స్థానాలు: మొత్తం 67 సర్పంచి స్థానాలకు, 570 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

**కౌంటింగ్ వేగవంతంపై దృష్టి..**

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్‌ను త్వరగా పూర్తిచేసే విధంగా ఎక్కువ కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు వేలకు పైగా ఓటర్లు ఉన్న ప్రతి గ్రామ పంచాయతీలో ఓట్ల లెక్కింపునకు మూడు కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. పెద్ద గ్రామాలకు కౌంటింగ్‌కు ఎక్కువ టేబుల్స్ కేటాయించామని, ధర్మసాగర్‌లో ఏడు టేబుల్స్‌తో కౌంటింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడో విడత ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని, ఏకగ్రీవ గ్రామ పంచాయతీలతో పాటు మొదటి విడత ఎన్నికలు పూర్తయిన మండలాల్లోనూ కోడ్ అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రెండో విడతలో 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, అక్కడ మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, ప్రతి ఒక్క ఓటరు తమ హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, తాగునీరు, దివ్యాంగుల కోసం వీల్ చైర్, హెల్ప్ డెస్క్ వంటి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ నెల ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభమై, సర్పంచ్, వార్డు స్థానాల ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

# కేయూకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నాం



◆ యూనివర్సిటీ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మంద వీరస్వామి

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన కాకతీయ విశ్వవిద్యాలయాన్ని (కేయూ) సందర్శించి, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, ఉద్యమకారులను ఉద్దేశించి ప్రసంగించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరస్వామి ఆహ్వానించారు. 2009 తెలంగాణ ఉద్యమంలో కాకతీయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిందని డా.మంద వీరస్వామి గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది విద్యార్థులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలకు కేయూ నిలయంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేయూలోని మౌలిక సమస్యలపై దృష్టి సారించాలని డా.వీరస్వామి విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యార్థులకు సరిపడా హాస్టల్ వసతులు లేవు. తరగతి గదుల కొరత, పాత భవనాలు. చాలా విభాగాలలో పరిశోధన (రీసెర్చ్) కోసం సరైన వసతులు, అత్యాధునిక రసాయనాలు (కెమికల్స్) లేవు. పరిశోధక విద్యార్థులకు సైతం విభాగాలలో మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో లేవన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందించాలని, ముఖ్యంగా అధిక సంఖ్యలో నిధులు కాకతీయ విశ్వవిద్యాలయానికి మంజూరు చేయాలని డాక్టర్ మంద వీరస్వామి కోరారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం ఉమ్మడి జిల్లాలోని శాసనసభ్యులు, మంత్రులు చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డా.మంద వీరస్వామి, డా.వలివుల్లా ఖాద్రి, డా.సూత్రపు అనిల్, డా.సురాసి కృష్ణ, డా.శ్రీనివాస్ నాయక్, డా.మధు, డా.రాజేందర్, డా.చందు తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

◆ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, సుబేదారి :** మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చిరుధాన్యాలను (మిల్లెట్స్‌ను) దైనందిన ఆహారంలో భాగం చేసుకోవాలని మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ – 8 తెలంగాణ బెటాలియన్ విద్యార్థినుల కోసం శనివారం చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. చిరుధాన్యాలు అధిక పోషక విలువలను కలిగి ఉండటం వలన అనారోగ్య సమస్యలకు పరిష్కారంగా నిలుస్తాయి. మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం (ఒబేసిటీ) వంటి దీర్ఘకాలిక సమస్యలను నియంత్రించడంలో చిరుధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని శ్రీనివాస్ సూచించారు. అవగాహన కార్యక్రమం అనంతరం కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ ఆహార ఉత్పత్తుల సంతను (మార్కెట్‌ను) ఎన్‌సీసీ విద్యార్థినులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్‌సీసీ విద్యార్థినులు శ్రావణి, మంజుల, సంత నిర్వాహకులు భయ్య సారయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కౌకొండ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

◆ సర్పంచ్ అభ్యర్థి ఓదెల శ్రీలత భాస్కర్



**నడికూడ, వరంగల్ వాయిస్:** మండలంలోని కౌకొండ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఓదెల శ్రీలత భాస్కర్ ప్రకటించారు. గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలతో మమేకమవుతూ, యువత, మహిళలు, వృద్ధుల మద్దతును కూడగడుతున్న ఆమె, గ్రామానికి సేవకురాలిగా, ఇంటి బిడ్డగా వస్తున్నానని తెలిపారు. ఎల్లవేళలా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, అందరి సహకారంతో సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక సేవలే తన ప్రధాన లక్ష్యాలని ఆమె స్పష్టం చేశారు. ఇంకా పరిష్కారంకాని అనేక సమస్యలు ఉన్నాయని, ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు తాను ముందుండి పోరాడతానని పేర్కొన్నారు. మాటలతో కాక, పనులతో నిలబడే నాయకత్వం గ్రామ ప్రజలకు అవసరమని శ్రీలత భాస్కర్ అభిప్రాయపడ్డారు. తనపై గ్రామ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉన్నట్లు సమాచారం అని, విజయం సాధించిన వెంటనే అభివృద్ధిలో మార్పును చూపిస్తానని ఆమె ఉద్ఘాటించారు. గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి, ఫుట్ బాల్ గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, గ్రామాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని ఓదెల శ్రీలత భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

# ఆరు గంటల్లో మొబైల్ గుర్తింపు

## బాధితుడికి అప్పగించిన చిట్యాల పోలీసులు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రానికి చెందిన గాజె రవీందర్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను చిట్యాల పోలీసులు కేవలం ఆరు గంటల్లో గుర్తించి, తిరిగి బాధితుడికి అప్పగించారు. పోలీసుల పనితీరు పట్ల బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే, చిట్యాల కేంద్రానికి చెందిన గాజె రవీందర్ శనివారం ఉదయం తన చేను నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో దారి మధ్యలో తన రియల్‌మీ నార్జో మొబైల్‌ను పోగొట్టుకున్నారు. వెంటనే ఆయన చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన అనంతరం, స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లాల్ సింగ్ తక్షణమే స్పందించి, పోయిన మొబైల్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేశారు. పోర్టల్‌లో మొబైల్ వివరాలు నమోదు చేసిన ఆరు గంటల్లోపే అట్టి మొబైల్‌ను పోలీసులు గుర్తించగలిగారు. గుర్తించిన మొబైల్‌ను చిట్యాల రెండవ ఎస్ఐ హేమలత గారు బాధితుడు గాజె రవీందర్‌కు అప్పగించారు. పోగొట్టుకున్న మొబైల్‌ను అతి తక్కువ సమయంలో గుర్తించి, తిరిగి ఇప్పించినందుకు గాజె రవీందర్ చిట్యాల పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీసుల సమయస్ఫూర్తి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని స్థానికులు అభినందించారు.

# నూతన సర్పంచ్ బొల్లం ఉమారాణి–రాజీవ్ కు సన్మానం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గ్రామ అభివృద్ధి రాజకీయాలకతీతంగా జరగాలని, ఈ కృషిలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్ పిలుపునిచ్చారు. శనివారం ఆమె స్వగృహంలో రఘునాథపల్లికి చెందిన మహిళలు సర్పంచ్‌ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉమారాణి రాజీవ్ మాట్లాడుతూ, ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తానని హామీ ఇచ్చారు. "ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ ప్రధాన కర్తవ్యం" అని ఆమె స్పష్టం చేశారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లం పద్మ, గ్రామ మహిళలు చింతకింది రాజేశ్వరి, మల్కాపురం మానస గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి అభివృద్ధి చేస్తాం

## బీఆర్ఎస్ అభ్యర్థి రూపా దేవి రవీందర్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆదరించండి గ్రామ అభివృద్ధికి పాటు పడతామని బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి పాపని రూపా దేవి రవీందర్ అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఓటర్లను రూపా దేవి కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రూపా దేవి రవీందర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో గ్రామ అభివృద్ధికి పాటుపడతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆత్మకూరు గ్రామ అభివృద్ధి జరిగిందన్నారు. రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రామంలో మురికి కాలువల నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందాయని ఆమె గుర్తు చేశారు. బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో కూలీలకు ఒరిగేదేమీ లేదు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూజ్య బాపు గ్రామీణ్ రోజ్ గార్ యోజనగా పేరు మార్చినంత మాత్రాన ఉపాధి కూలీలకు ఒరిగేదేమీ లేదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. 2006లో యూపీఏ ప్రభుత్వం పేదరికం నిర్మూలన వలసల నిరోధాన్ని అరికట్టేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తే మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులలో కోతలు విధిస్తూ నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ఉపాధి హామీ పథకానికి 2 లక్షల 70 వేల కోట్ల నిధులు కేటాయించాలని, సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించాలని, రోజుకు కనీస కూలి రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చితే కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సంవత్సరంలో 125 రోజుల పని దినాలు, రోజుకు కనీసకూలి 240రూపాయలకు సవరిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం కార్మికులకు నిరాశే మిగిల్చిందన్నారు. పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి సంవత్సరం లక్షలాది జాబు కార్డులను తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉపాధి హామీ పథకం కింద సంవత్సరంలో సగటున 50 రోజులు మాత్రమే పనికలిపించినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ పార్లమెంటులో చెప్పడంతో ఉపాధి కూలీలకు కల్పిస్తున్న పనితీరు అర్థమవుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి ఉపాధి పథకానికి నిధులు పెంచి గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా పనులు కల్పించాలన్నారు. లేనిచో కార్మికుల పోరాటాలు ఉధృతమైతాయని వెంకట్రాములు హెచ్చరించారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలో 11వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొంపెల్లి రవి శనివారం ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని రవి గెలుపు కోసం కృషి చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి కొంపెల్లి రవి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. సర్పంచ్ అభ్యర్థి పాపని రూపా దేవికి కత్తెర గుర్తుకు ఓటు వేయాలని, వార్డు సభ్యుడిగా తనకు గౌను గుర్తుకు ఓటు వేసి గెలిపించడంతో పాటు అభ్యర్థులిద్దరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. వార్డులోని సమస్యలను తాను ముందుండి పరిష్కరిస్తానని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తానని కొంపెల్లి రవి ఈ సందర్భంగా ఓటర్లకు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# డీసీసీ నూతన అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బట్టు కరుణాకర్‌ను కాళేశ్వరం ఆలయం వద్ద మహాదేవపూర్ మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ సన్మానించారు. శనివారం కాళేశ్వరం ఆలయ సందర్శన నిమిత్తం వచ్చిన డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పవన్ శర్మ, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ శర్మ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు తగిన గౌరవం, ఉన్నత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. "జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కార్యకర్త స్థాయి నుండి డీసీసీ అధ్యక్ష పదవి వరకు ఎదిగిన బట్టు కరుణాకర్ అందుకు నిదర్శనం. కాంగ్రెస్ పార్టీతోనే ఉంటూ పలు ఒడిదుడుకులు ఎదుర్కొంటూ వచ్చిన కార్యకర్తలకు ఇలాంటి ఎన్నో పదవులు ఇచ్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం సీనియర్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు లేతకరి రాజబాబు, హైదర్, షెకిల్, బాబా షేక్, గందెసిరి సత్యనారాయణ, మధు సూదన్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అభివృద్ధి కాంగ్రెస్ వల్లే సాధ్యం



## ◆ డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాళేశ్వరం గ్రామ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మెంగాని అశోక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ కాళేశ్వరం ప్రజలను కోరారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిర్ణయించిన అభ్యర్థి అశోక్‌కు బ్యాట్ గుర్తుపై ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడారు. "కాళేశ్వరం ప్రాంతం అభివృద్ధి దిశలో నడవాలంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుంది. గ్రామంలోని ప్రజలు ఈ వాస్తవాన్ని గ్రహించాలి. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి" అని ఆయన కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనపై డీసీసీ అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ముందుకు వచ్చినా, కాళేశ్వరం ప్రాజెక్టు కాస్త 'కూళేశ్వరం ప్రాజెక్టు'గా మారిందన్నారు. లక్షల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము వృథా అయ్యిందని, ఈ ప్రాజెక్టు రాష్ట్ర రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుంటే ఉందని ఆరోపించారు. రైతుబంధు విషయంలో గుట్టలకు, పుట్టలకు, రోడ్లకు నిధులు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. గత పదేళ్లలో ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా యువకుల చావులకు బీఆర్ఎస్ పార్టీ కారణమైందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంద్రమ్మ ప్రజల పాలన వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కరుణాకర్ వివరించారు. ఒక సంవత్సరంలోనే 61 వేల ఉద్యోగాలు భర్తీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రజలకు ఉచిత సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా పంపిణీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థి మెంగాని అశోక్‌ను గెలిపిస్తేనే కాళేశ్వరం గ్రామం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతుందని, ఈ అవకాశం స్థానిక ఓటర్ల చేతిలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ వేరే పార్టీ గెలుపు కోసం తోడ్పడితే, ఆయా కాంగ్రెస్ శ్రేణులపై కఠిన చర్యలు తప్పవని బట్టు కరుణాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా డీసీసీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ తో పాటు రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, మహాదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, కాళేశ్వరం సీనియర్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి, గందెసిరి సత్యనారాయణ, మాడుగుల పవన్ శర్మ, గందెసిరి మధు, హైదర్, మాచర్ల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

## మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ పిలుపు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బాసని శాంతా రవిని బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ గ్రామ ప్రజలను కోరారు. మండల కేంద్రంలోని తమ స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రప్రకాష్ మాట్లాడారు. ఈ నెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న కోతుల బెడద, కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామంలో డ్రైనేజీలు, వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థి శాంతా రవితో పాటు తాను కూడా భాగస్వామ్యం అవుతానని, గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చంద్రప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం గ్రామంలోని రెండు వార్డులలో పర్యటన ఉంటుందని చంద్రప్రకాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి శాంతా రవి, మాజీ కార్పొరేటర్ బాసని శ్రీనివాస్, బాసని వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

# టీపీయూఎస్ హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం

## అధ్యక్షుడిగా పున్నా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చిలుకా మధు






**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం శనివారం అల్కాపురి, హైదరాబాద్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పున్నా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చిలుకా మధు, కోశాధికారిగా పులిపాటి భాస్కర్ లు ఎన్నిక కాగా, అసోసియేట్ అధ్యక్షులుగా కుర్రే సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గుజ్జ శైలజ, తేలు శరత్ బాబు, అదిరే చత్రపతి, జాయింట్ సెక్రటరీ గంజి ధనుంజయ్, రంగు సుధీర్ కుమార్, డాక్టర్ రమా శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బేతి రాజేందర్, ఆనందాస్ రామలింగం యుగంధర్ బాబు, యేషాల శివానందం, మసన శ్రీనివాస్, ముతా వెంకటేష్, పబ్లిసిటీ సెక్రటరీ శ్రీరామ్ సుధాకర్, ఆఫీస్ కార్యదర్శి వేపూరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా గడిపల్లి రమేష్, రామా రవి, రాపోలు సోమేశ్వర్, బొద్దుల వెంకటగిరి ప్రసాద్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, మాజీ అధ్యక్షులు బాసబత్తిని రాజేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా శిరందాసు యాదగిరేందర్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు, ముఖ్య అతిథులు అభినందించారు.

# పుచ్చిపోయిన కూరగాయలతో వంట

- నర్సంపేట ఎస్సీ హాస్టల్‌లో దారుణం
- వార్డెన్ బీరన్నపై చర్యలు తీసుకోవాలి
- ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ ప్రీ–మెట్రిక్ బాలుర వసతి గృహం (ఎస్సీ హాస్టల్)లో విద్యార్థులకు పుచ్చిపోయిన కూరగాయలతో ఆహారం అందిస్తున్నారని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ (ఏఐఎఫ్‌డీఎస్) వరంగల్ జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హాస్టల్ వార్డెన్ బీరన్నపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జన్ను రమేష్, చుక్క ప్రశాంత్ ల ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు కిచెన్ రూమ్‌ను పరిశీలించగా, అక్కడ దారుణ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. కిచెన్ రూమ్‌లో ఉన్న టమాటాలు, దోసకాయలు, వంకాయలు మొత్తం కుళ్లిపోయి, పురుగులు పట్టి ఉన్నాయని నాయకులు గుర్తించారు. తక్కువ ధరకు వస్తున్నాయనే నెపంతో కుళ్ళిన కూరగాయలను కొనుగోలు చేసి, విద్యార్థులకు వండిస్తున్నారని వారు ఆరోపించారు. కిచెన్ రూమ్ కూడా శుభ్రం లేకుండా ఉందని ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ రకమైన కుళ్లిన ఆహారం ఇవ్వడం వలన విద్యార్థులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి భోజనం అందుతుందని భావించి తల్లిదండ్రులు హాస్టల్‌లో చేర్పిస్తే, కనీసం ఆలోచించకుండా ఇలాంటి కూరగాయలతో వంట వండటం సరికాదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే వార్డెన్ బీరన్నపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోని యెడల పెద్ద ఎత్తున ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల
- ఆత్మకూరులో విస్తృత ప్రచారం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గ్రామ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఇనుగాల వెంకట్రామిరెడ్డి తన స్వగ్రామమైన ఆత్మకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పర్వతగిరి మహేశ్వరి రాజుకు ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని. అలాగే కాంగ్రెస్ బలపరిచిన వార్డు సభ్యులను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఇనుగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన తప్పనిసరి



- డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రజలు వ్యాధి నిరోధక టీకాలపై పూర్తి అవగాహన కలిగి, తప్పనిసరిగా టీకాలను తీసుకొని వ్యాధులకు గురికాకుండా ఉండాలని జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఆదేశాల మేరకు, శనివారం ఆయన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ), పోర్టు వరంగల్ పరిధిలోని విద్యానగర్ అంగన్వాడి సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను పరిశీలించారు. అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 16 సంవత్సరాల వయసు వరకు నిర్దేశించిన కాలమానం ప్రకారం బాల బాలికలకు టీకాలను అందించి వ్యాధులకు గురికాకుండా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. గర్భిణీ స్త్రీలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సమయానుకూలంగా అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అందులోని సిబ్బంది ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరవేసి, అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండేటట్లు సేవలందించాలని తెలిపారు. సంక్రమిత, అసంక్రమితవ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని అరికట్టడంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచనలతో ప్రజలు ఆరోగ్య ప్రమాణాలను పాటిస్తూ, జీవనశైలిలో మార్పు తెచ్చుకొని వ్యాధులకు గురికాకుండా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీలత, ఆశా కార్యకర్తలు సృజన, సుస్మిత, అంగన్వాడీ టీచర్ సంధ్య, అంగన్వాడీ ఆయా శుక్రాణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో బీఆర్ఎస్‌కు షాక్

## కాంగ్రెస్ గూటికి 100 మంది కార్యకర్తలు



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన రెండవ వార్డు మెంబర్ ఇనుగాల ఐలుకొమ్మురు ఆధ్వర్యంలో సుమారు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వీరంతా పార్టీ మారినట్లు సమాచారం. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఒడిదల ప్రణయ్ బాబు గారి ఆధ్వర్యంలో శనివారం వీరంతా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. వార్డు మెంబర్ ఐలుకొమ్మురుతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం హుజూరాబాద్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తగా చేరిన వారికి స్వాగతం పలికారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

## సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోలీస్ అధికారులు తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. పోలీస్ కమిషనరేట్‌లో సివిల్ ఎస్సైలుగా పదోన్నతి పొందిన పలువురు అధికారులు శుక్రవారం రాత్రి సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. సుదర్శన్ రెడ్డి, రవీంద్రచారి, యాదగిరి, కృష్ణమూర్తి, అజిదుద్దీన్, ఉప్పలయ్య, సారంగపాణి, రాజేశ్వరి తదితరులు సీపీకి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... పదోన్నతి పొందిన అధికారులు తమ నూతన బాధ్యతలను స్వీకరించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. అప్పగించిన పనులను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మండలానికి 200 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ ఫోర్స్‌ను ఉద్దేశించి మండల ఎన్నికల పోలీస్ ఇంచార్జ్, డీఎస్పీ నారాయణ నాయక్ మాట్లాడారు. ఆయన సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలి. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల విధుల్లో పాటించవలసిన నియమావళి, 'చేయవలసినవి, చేయకూడనివి' గురించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం చిట్యాల సీఐ మల్లేష్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ.. మండల ప్రజలు, ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలని తెలిపారు.

# సర్పంచ్ రమేష్ యాదవ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** చింతనెక్కొండ గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన గాడుదుల రమేష్ యాదవ్‌ను శనివారం టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్) వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు, పర్వతగిరి మండల సీనియర్ పాత్రికేయులు బోనాల సాంబయ్య, రజిత దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. బోనాల సాంబయ్య, రజిత దంపతులు రమేష్ యాదవ్‌కు శాలువాతో సన్మానం చేసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామం అభివృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో యువ మండల నాయకులు వేల్పుల రాజు యాదవ్, వార్డు సభ్యులు మానస రాజశేఖర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు గాడుదుల రాజు, వంగ రాజు, గాడుదుల తరుణ్, అఖిల్, అరుణ్, మెదల్ రావు, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

# ‘స్కూల్ ఫస్ట్ యాప్’ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పాఠశాల నిర్వహణను, విద్యా సంబంధిత కార్యకలాపాలను సులభతరం చేసే లక్ష్యంతో ‘లైఫ్ బోర్డ్ టెక్నాలజీ’ వారు అభివృద్ధి చేసిన ‘స్కూల్ ఫస్ట్ యాప్’ నగరంలో లాంచ్ అయింది. ఈటి టెక్ ఎక్స్ సమ్మిట్ వేదికగా ఈ యాప్‌ను ప్రముఖ విద్యావేత్త, బ్రెయిన్ ఫీడ్ ఫౌండర్ డాక్టర్ అశోక్ పాండే, కాకాని బ్రహ్మం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాని బ్రహ్మం మాట్లాడుతూ ఈ యాప్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. ఆబ్జెక్టివ్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించవచ్చు. విద్యార్థుల పనితీరును విశ్లేషణలు అందిస్తుంది. ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జె.ఎస్.పరంజ్యోతి మాట్లాడుతూ.. ‘స్కూల్ ఫస్ట్ యాప్’ను ప్రధానంగా రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. ‘స్కూల్ జోన్’, ‘ఫ్యామిలీ జోన్’. ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, పాఠశాల లీడర్లు, కరస్పాండెంట్లు పాల్గొని, ఈ యాప్ పాఠశాలలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు మంచి ఉపయకరమైనదిగా అందరూ ప్రశంసించారు.

# అభివృద్ధి కోసం నన్ను గెలిపించండి

## తహరాపూర్ సర్పంచ్ అభ్యర్థి కుక్కల సరోజన

**వరంగల్ వాయిస్, తహరాపూర్ :** తహరాపూర్ గ్రామ సర్పంచ్‌గా తనను గెలిపించాలని కోరుతూ సర్పంచ్ అభ్యర్థి కుక్కల సరోజన శనివారం ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆమె గ్రామ ప్రజలను కలుసుకుని, తమకు ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. సర్పంచ్ అభ్యర్థి కుక్కల సరోజనతో పాటు 9వ వార్డు అభ్యర్థి రవి, 5వ వార్డు అభ్యర్థి కుమారస్వామి, దాసరి నరేష్, బడుగు సునీల్ మరియు పలువురు గ్రామ ప్రజలు ప్రచారంలో పాల్గొన్నారు. తహరాపూర్ అభివృద్ధికి సంబంధించిన తమ ప్రణాళికలను వివరిస్తూ, గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సరోజన గారు ఓటర్లకు హామీ ఇచ్చారు.



# రేవంత్ ‘పాయిజన్ 2047’గా మారాడు

◆ సీఎం రేవంత్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యాల బారిన పడుతున్న ఘటనలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పిల్లల పాలిట’పాయిజన్ 2047’గా మారాడని, పేద పిల్లలపై ముఖ్యమంత్రి పగబట్టాడని విమర్శించారు. హైదరాబాద్ కింగ్ కోఠి దవాఖానలో చికిత్స పొందుతున్న బాగ్ లింగంపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్‌తో కలిసి హరీశ్ రావు పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూరేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో 116 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నాడని, ఇంతమంది విద్యార్థులు చనిపోతున్నా ముఖ్యమంత్రికి కనీసం చీమకుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. “నీ రెండేళ్ల పాలనలో స్కూలు విద్యార్థులకు కనీసం పట్టెడన్నం పెట్టలేక పోతున్నావు. విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ అట్టర్ ఫ్లాప్ అయ్యాడు” అని దుయ్యబట్టారు. ప్రతిరోజూ ఏదో ఒక గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మొన్న షామీర్‌పేట బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తే విద్యార్థులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారని గుర్తుచేశారు. నిన్న మాదాపూర్‌లోని చందునాయక్ తండాలో మధ్యాహ్న భోజనం వికటించి 43 మంది పిల్లలు ఆసుపత్రి పాలయ్యారు. ఇప్పుడు ముషీరాబాద్ నియోజకవర్గంలో బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకులంలో కలుషిత ఆహారం తిని ఏకంగా 90 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. రైతులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థుల సమస్యలు ఉన్నా రాహుల్ గాంధీ రాడు, కేవలం ఫుట్‌బాల్ మ్యాచ్ చూడటానికి వస్తున్నాడని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# ఎంబాడి రవీందర్ సేవలు చిరస్మరణీయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ సేవలు చిరస్మరణీయమని తెలంగాణ పెరిక కుల సంఘం (766/2014) వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ అన్నారు. ఎంబాడి రవీందర్ జయంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు అల్లం రాజేశ్ వర్మ మాట్లాడుతూ పెరిక కులం అభ్యున్నతి కోసం ఎంబాడి రవీందర్ అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. రవీందర్ ఆశయాలను కొనసాగిస్తున్న ఆయన కుటుంబానికి సంఘం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంబాడి అమరేందర్, బెడిద వీరన్న, బేల రమేశ్, సుంచు వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్, అంకతి అభిలాష్, అచ్చ లక్ష్మణ్, ఇట్నేని శశిధర్, బేల కర్ణాకర్, నాగేందర్, పూర్ణ చందర్ పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో దారుణం

## భార్యను హత్య చేసి, భర్త ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత విషాదకరమైన, దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. గణపురం మండలం సీతారాంపురం గ్రామంలో భార్యను హతమార్చిన భర్త ఆ వెంటనే ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాలాజీ రామాచారి (50) తన భార్యసంధ్య (42)ను తాడుతో ఉరి బిగించి హత్య చేశాడు. అనంతరం అతను కూడా అదే విధంగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామాచారి ఆత్మహత్యకు ముందు ఒక వీడియోను రికార్డు చేసి, దానిని తన ఫోన్‌లో స్టేటస్‌గా ఉంచినట్లు సమాచారం. ఆ వీడియోలో, తన భార్య, కూతురు వేధింపులు తట్టుకోలేకే ఈ దారుణానికి పాల్పడినట్లుగా అతను పేర్కొన్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, రామాచారికి ఇది రెండో వివాహం. మొదటి భార్య మరణించిన తర్వాత సంధ్యను వివాహం చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# ఓటును అమ్ముకోవద్దు

తెలంగాణ రాష్ట్రంలో మూడు విడతల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలు ప్రారంభమయ్యాయి. ఓటు హక్కు వినియోగించుకునే ఈ చారిత్రాత్మక సందర్భంలో, ప్రతి ఓటరు తమ బాధ్యతను, గ్రామం పట్ల కర్తవ్యాన్ని, భవిష్యత్తు తరాల పట్ల నిబద్ధతను గుర్తుంచుకోవాల్సిన సమయం ఇది. ఈ ఎన్నికలు కేవలం అభ్యర్థుల గెలుపోటముల కోసం కావు; ఐదు సంవత్సరాలలో మన గ్రామ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం మనకే దక్కుతుంది. ఇటీవలి ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో కనిపిస్తున్న బాధాకరమైన ధోరణి ఆందోళన కలిగిస్తోంది. డబ్బు, మద్యం, బహుమతుల రూపంలో ఇచ్చే ప్రలోభాలకు ఓటర్లు లొంగిపోవడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. యువత సరైన, నిజాయితీపరుడైన నాయకుడిని గుర్తించలేకపోతున్నారు. పెద్దలు తాత్కాలిక ప్రయోజనం కోసం గ్రామానికి శాశ్వత నష్టాన్ని ఒప్పుకుంటున్నారు. గ్రామాల అభివృద్ధి ఐదు సంవత్సరాలు వెనక్కి నెట్టబడుతోంది, ప్రజాస్వామ్య విలువలు బలహీనమవుతున్నాయి. ఓటును అమ్మడం అంటే మన భవిష్యత్తును అమ్ముకోవడమే. ఓటును అమ్మడం అంటే మన తరాలకు చీకటిని వదిలిపెట్టడం. ప్రతి ఓటరు, ముఖ్యంగా యువత మరియు కొత్తగా ఓటు హక్కు పొందిన వారు ఈ ముఖ్య విషయాన్ని గుర్తుంచుకోవాలి. డబ్బుకు తలవంచి ఓటు వేయడం మన వ్యక్తిగత గౌరవాన్ని కోల్పోవడమే. డబ్బు ఇచ్చేవారు అభివృద్ధి కోసం పని చేయరు. వారు ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి సంపాదించుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఓటును అమ్ముకున్నందున, ఐదేళ్లూ మనం ఆ నాయకుడిని ప్రశ్నించలేము. మద్యం కోసం ఓటు ఇచ్చే వ్యక్తి తన భవిష్యత్తును ఒక రాత్రికోసం పణంగా పెడుతున్నాడు. ఒక బాటిల్ మద్యం కోసం మన గ్రామం ఐదు సంవత్సరాలు కష్టపడుతుంది. ప్రలోభాలకు లొంగి వేసిన ఓటు, మీ కుటుంబం భవిష్యత్తుపై ప్రత్యక్షంగా దాడి చేయడంతో సమానం. ఎన్నికలు ముగిశాక డబ్బు, మద్యం లాభం ఆగిపోతుంది, కానీ నష్టాలు ఐదు సంవత్సరాలు కొనసాగుతాయి.

## యువతకు ప్రత్యేక పిలుపు..

మార్పును తీసుకురాగల శక్తి మీలోనే ఉంది. మొదటిసారి ఓటు వేసే యువత ఈ ఎన్నికల్లో అత్యంత ప్రాధాన్యం గల వర్గం. మీ ఒక్క నిర్ణయం మీ గ్రామం ఎటువైపు వెళ్లాలి అన్నది నిర్ణయిస్తుంది. యువత చేయాల్సిందల్లా అభ్యర్థుల పనితీరు, ప్రవర్తన, గ్రామాభివృద్ధికి చేసిన కృషిని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎవరి ప్రభావం లేకుండా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాలి. డబ్బు, మద్యం తీసుకోకుండా గ్రామానికి ఆదర్శంగా నిలబడాలి. ఇతరులకు కూడా ఓటు విలువను, దాని ప్రాధాన్యతను తెలియజేయాలి. యువత ఓటు గ్రామాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం. సర్పంచ్ ఒక గ్రామ అభివృద్ధికి మార్గదర్శి. సర్పంచ్ బాధ్యతలు మనం ఎన్నుకునే వ్యక్తి స్వభావంపై ఆధారపడి ఉంటాయి. రహదారులు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, వీధి దీపాలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, అవినీతి లేని నిర్వహణ సర్పంచ్ ల చేతిలో ఉంటుంది. గ్రామ సభల ద్వారా ప్రజలతో నిరంతర సంభాషణ. సరైన సర్పంచ్ ఉంటే గ్రామం ముందుకు వెళుతుంది. తప్పు వ్యక్తి గెలిస్తే గ్రామం ఐదు సంవత్సరాలు వెనక్కి పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని, మన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి అందరం కూడా మన విలువైన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని మనసారా కోరుతున్నాము.

వ్యాస కర్త
ముదిరి నాగరాజు
ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఈడీ






# ఆ దేశాలలో 'ధురంధర్' సినిమాపై నిషేధం

రణ్ వీర్ సింగ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ధురంధర్. యురి ఫేమ్ ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ సినిమాలో సారా అర్జున్ కథానాయికగా నటించింది. అలాగే అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, మాధవన్ తదితర స్టారాది స్టార్స్ నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ధురంధర్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతున్న ఈ మూవీ గురించి ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సూపర్ హిట్ సినిమాపై నిషేధం విధించారు. ఒకటి కాదు, రెండు కాదు, ఆరు దేశాలు ఈ సినిమాను నిషేధించాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ నిషేధాన్ని విధించాయి. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కిన ధురంధర్ మూవీలో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా సన్నివేశాలు ఉండడంతో ఇస్లామిక్ దేశాలు ఈ సంచలన నిర?యాన్ని తీసుకున్నాయి. గతంలో, 'స్కై ఫోర్స్', 'ఫైటర్', 'ఆర్టికల్ 370', 'టైగర్ 3' సినిమాలను కూడ ఈ దేశాలలో నిషేధించారు. అయితే ధురంధర్ చిత్ర బృందం తమకు ఆసమస్య రాకుండా శాయశక్తులా ప్రయత్నించింది. కానీ అది సాధ్యం కాలేదు. సెన్సార్ బోర్డు ఈ సినిమా రిలీజ్ కు అంగీకరించలేదు. ఈ సినిమా డిసెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుండి, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లు, భారతదేశంలో రూ. 200 కోట్లు వసూలు చేసింది. ఈ వారాంతంలో ఈ సినిమా మరిన్ని వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది. కాగా చాలా సంవత్సరాల తర్వాత ఈ సినిమాతో రణ్‌వీర్ సింగ్ హిట్ కొట్టాడు. ఈ సినిమా అతని కెరీర్‌కు మంచి మైలేజ్ ఇచ్చింది. వివాదాలు ఉన్నప్పటికీ, సినిమాకు భారీ కలెక్షన్లు సాధిస్తున్నాయి.

# అఖండ 2లో గూస్ బంప్స్ మూమెంట్

నటసింహం నందమూరి బాలకృష? హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్–డివోషనల్ ఎంటర్టైనర్ 'అఖండ 2: తాండవం' . భారీ అంచనాల నడుమ థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీకి మంచి స్పందన వస్తుంది. తొలి భాగం 'అఖండ' సృష్టించిన సెన్సేషన్‌కు కొనసాగింపుగా వచ్చిన ఈ సీక్వెల్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల అనంతరం ఆ అంచనాలను నిజం చేస్తూ సినిమా మాస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా బాలయ్య నట విశ్వరూపం, పవర్‌ఫుల్ డైలాగ్స్, రుద్ర తాండవం వంటి యాక్షన్ సన్నివేశాలు బాలయ్య అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. అయితే.. ఈ మూవీ శివుడి పాత్ర బాలయ్యనే డామినేట్ చేసేలా ఉంది. తాండవంలో బాలకృష?ను దర్శకుడు బోయపాటి శ్రీను మరింత ఎలివేటెడ్ క్యారెక్టర్‌లో చూపించాడు. అఘోర లుక్, ఉగ్రరూపం, హావభావాలు, పవర్ ఫుల్ యాక్షన్ సన్నివేశాల్లో బాలయ్య చూపించిన ఇన్టెన్సిటీ సినిమాకే ప్రధాన బలం అని చెప్పొచు. వాస్తవానికి బోయబాటి – బాలయ్య సినిమా అంటే.. లాజిక్ లను పక్కన బెట్టిన వారి చేసే మ్యాజిక్ చూడాల్సిందే. ఈ కాంబో ఎక్కువ మాస్ ఎలివేషన్లకు ప్రాధాన్యం ఇస్తుందనే విషయం తెలిసిందే. ఈ మూవీలో కూడా బోయపాటి తన మార్క్ టేకింగ్‌తో, బాలయ్య పాత్రను దాదాపు ఓ సూపర్ హ్యూమన్ గా క్రియేట్ చేశారనే చెప్పాలి. అందుకు తగ్గట్టుగానే బాలయ్య పాత్ర ఎనిమిది సంవత్సరాలు కఠోర తపస్సు చేసినట్టు చూపించారు. ఇదిలా ఉంటే.. 'అఖండ 2: తాండవం'లో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పరమేశ్వరుడి పాత్ర. తొలి భాగం 'అఖండ'లో శివుడి ప్రస్తావన ప్రతీకాత్మకంగా మాత్రమే ఉండగా, ఈ సీ క్వె ల్ లో ఆ భావన మరింత విస్తరించింది. ఈసారి ఏకంగా కైలాసం నుంచి పరమేశ్వరుడు భూమికి దిగివచ్చే ఘట్టాన్ని చూపించడం ఆధ్యాత్మికతత్వాన్ని మరింత పెంచినట్టు అయింది. కథలో అఖండ తల్లి మరణించే సందరరేలో వచ్చే ఈ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలుస్తోంది. ఈ సన్నివేశంలో కైలాసంలో ఉన్న శివుడు స్వయంగా భూమిపైకి వచ్చి అఖండ తల్లి చితికి అగ్నిసంస్కారం చేసినట్టు చూపించారు. ఈ సీన్ ను దర్శకుడు బోయపాటి అత్యంత భక్తిభావంతో, గ్రాండ్ విజువల్ తో తెరకెక్కించారు. అలాగే.. ఆ సీన్ కు తగ్గట్టుగా తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ కలిసొచ్చి



థియేటర్లలోని ప్రతి ప్రేక్షకుడికి గూస్ బంప్స్ వచ్చేలా చేస్తున్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. వెంటనే ఆ సీన్ ముగిసిన తర్వాత చప్పట్లతో థియేటర్లు మార్మోగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ కీలక ఘట్టంలో శివుడి పాత్రలో నటించింది బాలీవుడ్ నటుడు తరుణ్ ఖన్నా . హిందీ టెలివిజన్ ప్రేక్షకులకు శివుడిగా ఇప్పటికే సుపరిచితుడైన తరుణ్ ఖన్నా, ఈ సినిమాలోనూ అదే గంభీరతతో పరమేశ్వరుడి పాత్రలో ఒదిగిపోయారు. ఆయన తెరపై కనిపించిన ప్రతిసారి గూస్‌బంప్స్ రావడం ఖాయమని ప్రేక్షకుల అభిప్రాయం. తరుణ్ ఖన్నా 2015లో ప్రసారమైన మైథలాజికల్ సీరీస్ 'సంతోషి మా'లో తొలిసారి శివుడిగా నటించి మంచి పేరు సంపాదించారు. శివుడిగా ఆయనకు ఉన్న అనుభవమే 'అఖండ 2'లో ఆ పాత్రను మరింత నమ్మకంగా చూపించేందుకు ఉపయోగపడిరదని చెప్పాలి.

# ఓటీటీలోకి

## రాజు వెడ్స్ రాంబాయి

తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. కొత్త డైరెక్టర్ సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ ప్రేమ కథా చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో, హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. అయినా తమ అద్భుత నటనతో ఆడియెన్స్ తో కన్నీళ్లు పెట్టించారు. ఇక సిద్ధు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ విలన్ పాత్రలో బాగా భయపెట్టాడు. ఈ సినిమాలో అతని నటనే హైలెట్ అని చెప్పుకోవచ్చు. నవంబర్ 21న విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి సినిమా మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి కలెక్షన్లు రాబట్టింది చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ రూరల్ లవ్ స్టోరీ రూ.17 కోట్ల కు పైగా కలెక్షన్లు రాబట్టింది. థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచిన ఈ సినిమాను ఓటీటీలో చూడాలని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే వీరి నిరీక్షణకు తెరపడనుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో రాజు వెడ్స్ రాంబాయి ఓటీటీ స్ట్రీమింగ్ పోస్టులు దర్శనమిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వెలువడవచ్చు.డా. నాగేశ్వర్ పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, డోలాముఖి సబాల్టర్న్ ఫిల్మ్స్, మాన్సూన్ టేల్స్ బ్యానర్‌లపై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాస్‌ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేశారు. శివాజీ రాజా, అనిత చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.





# ఇండస్ట్రీలో నన్ను తొక్కేశారు

తల్లి, అక్కా, వదిన ఇతర సహాయ పాత్రలతో తెలుగునాట పాపులర్ అయ్యారు నటి ప్రగతి. హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఆమె.. అనూహ్యంగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా టర్న్ అయ్యారు. అయినప్పటికీ తన ప్రతిభను నిరూపించుకుని వందలాది చిత్రాల్లో నటించారు ప్రగతి. అయితే గత కొన్నాళ్లుగా ప్రగతి సినిమాలకు దూరమై పవర్ లిఫ్టర్ అవతారం ఎత్తారు. పలు క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించారు శెభాష్ అనిపించుకున్నారు. 50 ఏళ్ల వయసులో మహిళ అయ్యుండి ఎంతో కష్టమైన ఈ పనిని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే వయసు అనేది ఒక నెంబర్ మాత్రమేనని ప్రగతి నిరూపిస్తున్నారు. పవర్ లిఫ్టింగ్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో పతకాలు సాధించిన ప్రగతి.. ఇటీవల టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో నాలుగు పతకాలు కైవసం చేసుకుని సంచలనం సృష్టించారు. దాంతో ప్రగతి పేరు చిత్ర సీమలో మారుమోగుతోంది. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రగతి తన తండ్రి మరణంతో కుటుంబ పోషణ నిమిత్తం డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత మోడలింగ్‌లోకి దిగిన ప్రగతి .. ఆ తర్వాత హీరోయిన్‌గా పలు తమిళ చిత్రాల్లో నటించారు. అనంతరం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారారు. కానీ అనూహ్యంగా సినిమాలకు దూరమైన ప్రగతి పవర్ లిఫ్టర్ అవతారం ఎత్తి షాకిచ్చారు. దీని వెనుక ఏం జరిగింది? సినిమాలను ఎందుకు వదిలేశారు? అన్న దానిపై ఇటీవల ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు ప్రగతి.

# పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్,వరంగల్ :** రెండవ విడతలో ఆదివారం నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు–2025లో భాగంగా శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద నాలుగు మండలాల్లోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు: గీసుగొండ: జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, సంగెం: జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, దుగ్గొండి: జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, నల్లబెల్లి: సుమంగలి ఫంక్షన్ హాల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్‌ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడి, వారికి కీలక సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలి. ఏవైనా సమస్యలుంటే జోనల్, రూట్ అధికారులకు వెంటనే తెలియజేయాలి. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలి. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలి. సిబ్బంది తప్పనిసరిగా ఫామ్ 9 ప్రకారం బ్యాలెట్ బాక్సులను చెక్ చేసుకోవాలి. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అందించిన సామాగ్రిని జాగ్రత్తగా సీల్ చేసి డిపాజిట్ చేయాలి. సిబ్బందికి సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ ద్వారా నివృత్తి చేసుకొని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రాం రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వసూళ్లు మానుకోండి

- ట్రాన్స్‌జెండర్ల పై సీపీ సజ్జనార్ ఆగ్రహం

**వరంగల్ వాయిస్,హైదరాబాద్:** ట్రాన్స్‌జెండర్ల బెదిరింపు వసూళ్లు, గ్రూపు తగాదాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఇకపై బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో సుమారు 250 మంది ట్రాన్స్‌జెండర్లతో సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించారు. సీపీ సజ్జనార్ మాట్లాడుతూ బలవంతపు వసూళ్లకు, ఆధిపత్య పోరుకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జైలుకు పంపిస్తామని సీపీ స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ట్రాన్స్‌జెండర్లు వాడుకుని సమాజంలో గౌరవంగా జీవనం సాగించాలని సూచించారు. గ్రూపు తగాదాలు, ఆధిపత్య పోరు కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, ప్రాణ నష్టానికి కూడా దారితీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వివాహాలు, శుభకార్యాల సమయంలో ట్రాన్స్‌జెండర్లు గుంపుగా ఇళ్లపైకి వెళ్లి ప్రజలను ఇబ్బంది పెట్టడం, భారీగా డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని ఆయన తెలిపారు. సామాన్యులను తమ చేష్టలతో ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఈ సందర్భంగా సీఐడీ, మహిళా భద్రతా విభాగ అడిషనల్ ఏడీజీ చారు సిన్హా మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించడానికి గాను మహిళా భద్రతా విభాగంలో 'ప్రైడ్ ప్లేస్' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, వారిని ఎవరైనా వేధింపులకు గురిచేసినా.. వెంటనే ఈ వింగ్‌ను సంప్రదించవచ్చని చారు సిన్హా తెలిపారు. వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి మహిళా భద్రతా విభాగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీ సజ్జనార్, ఏడీజీ చారు సిన్హాతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓడిన అభ్యర్థుల ఆందోళన

- లక్షలు ఖర్చు చేసినా ఓట్లేయలేదని నిలదీత
- డబ్బులు తిరిగి ఇవ్వాలని పట్టు
- లేకుంటే ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులు
- ఏకగ్రీవ పంచాయతీల్లోనూ "డబ్బు, మందు" కోసం ఓటర్ల డిమాండ్



**వరంగల్ వాయిస్, నల్లగొండ/వరంగల్ :** తెలంగాణలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం పలుచోట్ల విస్మయకరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల్లో భారీగా డబ్బులు ఖర్చు పెట్టి ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులు లబోదిబోమంటూ ఓటర్ల ఇళ్ల చుట్టూ తిరుగుతూ, ఖర్చు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామంలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి ఆందోళన స్థానికంగా కలకలం రేపింది. ఎన్నికల కోసం రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేశానని వాపోతున్న సదరు అభ్యర్థి, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని దేవుడి ఫొటోతో ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తులను వేడుకుంటున్నాడు. అయితే ప్రజలు తాము అతనికే ఓటు వేశామని చెబుతుండటంతో, ఓట్లు వేశామని చెబుతున్న ఓటర్లను దేవుడిపై ప్రమాణం చేయించుకుంటున్నాడు. "అందరూ నాకే ఓట్లు వేస్తే ఎలా ఓడిపోయాను?" అంటూ కన్నీరు పెట్టుకుంటూ నిలదీయడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. నల్లగొండతో పాటు మెదక్, వరంగల్ జిల్లాల్లో కూడా కొందరు ఓడిపోయిన అభ్యర్థులు ఇలానే తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ ఓడిపోయిన అభ్యర్థులు బెదిరిస్తున్నట్లు సమాచారం.

## రెండో విడతలోనూ అదే వాతావరణం

మొదటి విడత పూర్తయి, రెండో విడత పోలింగ్ ఆదివారం జరుగనున్న నేపథ్యంలో పోటీ ఉన్న గ్రామాల్లో సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అంతులేని హామీలతో పాటు, సాయంత్రం మందు, విందు, మహిళలకు చీర, సారెలను అందజేస్తున్నారు. అంతేకాక ఓటుకు రూ. 2 వేలు ఇస్తామని హామీ ఇస్తుండటంతో గ్రామాల్లో ఎన్నికల సంబురాలు కనిపిస్తున్నాయి. వరి కోతలు పూర్తికావటంతో అందరి దృష్టి ఎన్నికలపైనే కేంద్రీకృతమైంది.

## ఏకగ్రీవాల్లో విచిత్ర పరిస్థితి..

మరోవైపు, రెండు, మూడో విడతల్లో ఏకగ్రీవమైన పంచాయతీల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఏకగ్రీవం అయినందున మందు, విందు, డబ్బులు అందలేదనే నిరుత్సాహం ఓటర్లలో స్పష్టంగా కనిపిస్తోంది. "ఓడిన వారు ఏడిస్తే, గెలిచిన వారు ఇంటికి వచ్చి ఏడ్చిన మాదిరి" తమ పరిస్థితి ఉందని ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకగ్రీవం కోసం పెద్ద మనుషులకు నగదు ఇచ్చామని, అయితే ఎన్నికయ్యాక ఓటర్లు ఇప్పుడు మళ్లీ నగదు, మందు, విందులు చేయాలని డిమాండ్ చేస్తుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వారు వాపోతున్నారు.



# రాసిస్తా.. నెరవేరుస్తా..

**స్వతంత్ర అభ్యర్థి బాదావత్ ఉమ**

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తమ గ్రామ పంచాయతీని అభివృద్ధి దిశగా నడిపించడమే ఏకైక లక్ష్యమని, ఇందుకోసం ఇచ్చిన నవరత్నాల హామీలను తప్పక నెరవేర్చుతానని, లేనిపక్షంలో పదవి నుంచి వైదొలుగుతానని మల్లాయికుంట తండా స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి బాదావత్ ఉమ రమేష్ నాయక్ సంచలన ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ సర్పంచ్ అభ్యర్థి చేయని విధంగా, తమ హామీలను బాండ్ కాగితంలో లిఖించి ప్రమాణ పత్రాన్ని తయారు చేసి ఇంటింటికీ జిరాక్స్ కాపీలను అందిస్తూ ఈ దంపతులు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో, వాటిని అమలు చేసేందుకు ఈ దంపతులు నవరత్నాలను హామీగా ఇస్తున్నారు. గెలిచిన వెంటనే ప్రతి నెల వచ్చే సర్పంచ్ జీతం నుంచి మల్లాయికుంట, ధాన్యతండ ప్రజలకు త్రాగు నీటి కోసం ఉచితంగా మినరల్ వాటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తా. విద్యార్థుల చదువుకై లైబ్రరీ స్థాపించి, పోటీ, ఉద్యోగ పరీక్షల కోసం ఉపయోగపడే పుస్తకాలు, కోచింగ్ క్లాసులు ఏర్పాటు చేస్తా. గ్రామంలో ఇప్పటి వరకు లేని అండర్ డ్రైనేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, పంచాయతీ పరిధిలో ఎలాంటి చెత్త, చెదారం లేకుండా చర్యలు తీసుకుంటా. ప్రభుత్వం తరపున వచ్చే ప్రతి ఒక్క పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో జరిగే వివాహాల్లో ఆడబిడ్డలకు 'గ్రామ పంచాయతీ కానుక'గా రూ.3016/తో పాటు నాణ్యమైన చీరను బహుమానంగా ఇస్తా. పంచాయతీ పరిధిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే, మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యాన్ని అందజేస్తా. స్కూల్ వెళ్లకుండా ఉండే డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి, కౌన్సిలింగ్ ఇప్పించి బడికి పంపే ప్రయత్నం చేస్తా.

ఇప్పటి వరకు తనకు సంబంధించిన ఆస్తుల కన్నా, ఒక్క రూపాయి ఎక్కువ సంపాదించినట్లు నిరూపిస్తే, ఆ ధనాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తానని వివరించారు. అయ్యప్ప గుడి సత్రం కొరకు ఎవరైనా దాతలు భూమిని విరాళంగా అందిస్తే తమ సొంత ఖర్చులతో సత్రం కట్టిస్తామని హామీ ఇచ్చారు. గతంలోనూ విద్యార్థులకు టై, బెల్ట్, షూ, బుక్స్, యువతకు క్రికెట్ కిట్ అందించడం వంటి కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేస్తూ... తన హామీలను తప్పక నెరవేరుతానని, తనను నమ్మి సర్పంచ్‌గా కత్తెర గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఉమ రమేష్ దంపతులు గ్రామస్తులను వేడుకుంటున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com